# ఎంపీపై హత్యాయత్నం చేసిన నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్

**తానే నేరం చేసినట్లు ఒప్పుకున్న నిందితుడు**

**అందరి దృష్టి తనపై పడాలనే నేరం చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారణ**

- తదుపరి విచారణ కొనసాగుతుంది..
- సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు పెడితే కేసులు నమోదు చేస్తాం
- మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దు..
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఏర్పాట్లు
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ శ్వేత



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, నవంబర్ 1: మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై గత నెల 30వ తేదీన హత్యాయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. బుధవారం సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ వివరాలు వెల్లడించారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని సూరంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన ఘటం రాజు(40) కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఎంపీ గన్‌మెన్ ప్రభాకర్ నిందితుడిని పక్కకు నెట్టి ఎంపీని కాపాడాడు. అక్కడినుంచి హుటాహుటిన ఎంపీ ప్రభాక్‌రెడ్డిని గజ్వేల్ దవాఖానకు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కేసును అన్ని కోణాల్లో ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని, ప్రత్యక్ష, పరోక్ష సాక్షులను విచారించి సాంకేతిక నైపుణ్యంతో ఆధారాలు సేకరించినట్లు సీపీ తెలిపారు.

**నేరం అంగీకరించిన నిందితుడు**

నిందితుడు ఘటం రాజు విలేకరి అని చెప్పుకుంటూ ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తూ జల్సాలు చేసే వాడని, కానీ అతడిపై ఎక్కడా కేసు నమోదు కాలేదని సీపీ తెలిపారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని చంపాలనే ఉద్దేశంతోనే దుబ్బాక మార్కెట్‌లో కత్తి కొనుగోలు చేసి హత్యాయత్నం చేసినట్లు తెలిపారు. ఘటన సమయంలో నిందితుడిని అక్కడున్న ప్రజలు కొట్టి గాయపరిచారని.. దీంతో రాజును అదుపులోకి తీసుకొని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి చికిత్స చేయించామన్నారు. దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత నిందితుడు రాజును తొగుట సీఐ కమలాకర్ బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా అందరి దృష్టి తనపై పడాలనే ఎంపీపై హత్యాయత్నం చేసినట్లు నేరం ఒప్పుకున్నాడని వివరించారు. ఈ ఘటనలో నిందితుడు నేరం చేయడానికి గల ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా, ఇందుకు ఎవరైనా సహకరించారా? అనే కోణంలో పూర్తి స్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా విచారణ కొనసాగుతున్నదని వెల్లడించారు.

**సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దు**

ప్రజలు, యువకులు, రాజకీయ పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెడుతున్నారని, వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సీపీ శ్వేత హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, దీనిపై ప్రత్యేకంగా సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అభ్యంతరకర పోస్టులు, తప్పుడు వార్తలు పెడితే వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని సూచించారు. పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగంతో కలిసి ఏర్పాట్లు చేస్తామన్నారు.

**రిమాండ్‌కు నిందితుడు రాజు**

గజ్వేల్, నవంబర్ 1: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన నిందితుడు రాజును బుధవారం గజ్వేల్ కోర్టులో దౌల్తాబాద్ పోలీసులు హాజరుపర్చారు. నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు.



నర్సరీ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

## ధూళిమిట్టలో 'ఉపాధి' పనులు భేష్

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 1: ధూళిమిట్టలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల పరిశీలనకు కేంద్ర బృందం బుధవారం గ్రామంలో పర్యటించింది. గ్రామంలోకి వచ్చిన బృందంలోని సభ్యులు డాక్టర్ శృతిగుప్తా, కుమార్, జోషిచౌదరి సులేమాన్‌లకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. 2015 నుంచి 2023 వరకు కేటగిరీ-ఏలో చేపట్టిన డంపింగ్‌యార్డ్, హరిత నర్సరీ, బృహత్ ప్రకృతివనం, పల్లె ప్రకృతివనం, ఎవెన్యూ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్, ల్యాండ్ డెవలప్‌మెంట్, చెక్‌డ్యాంలు తదితర పనులను బృందంలోని సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి పనుల పరిశీలనకు ఎంపిక చేసిన రెండు గ్రామాల్లో ధూళిమిట్ట గ్రామం ఒకటన్నారు. క్షేత్ర స్థాయిలో ఉపాధి పనుల అమలు తీరు ఏ విధంగా ఉందో క్షుణ్ణంగా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఎంపిక చేసిన గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉపాధి పనులు బాగా జరిగాయని ప్రశంసించారు. కూలీలకు ఉపాధి కల్పించేందుకు గ్రామంలో అనేక పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఉపాధి పనులను ఇంతమంచిగా నిర్వహించిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేంద్ర బృందంలోని సభ్యులను మండల అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, ఈసీ పరశురాములు, సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాజు, అనిత, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాధాకృష్ణశర్మ

## 100 సీట్లతో కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా

- కాంగ్రెస్‌లో కుమ్ములాటలు, బీజేపీలో అభ్యర్థులు కరువు
- బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకం అందని ఇల్లులేదు
- లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపించుకుందాం
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మండల సమన్వయకర్త, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

జగదేవ్‌పూర్ నవంబర్ 1: సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల కాలంలో గజ్వేల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మండల సమన్వయకర్త, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. బుధవారం మండలంలోని తీగుల్‌నర్సాపూర్ కొండపోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి బీఆర్ఎస్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. మొదట జంగంరెడ్డిపల్లె, తీగుల్‌నర్సాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తెలంగాణ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించి ఓట్లు అభ్యర్థించారు. కేసీఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి జరిగిందని, రోడ్లు బాగయ్యాయని, తాగు నీటి సమస్య తప్పిందన్నారు. కాంగ్రెస్‌లో కుమ్ములాటలు, బీజేపీలో అభ్యర్థులు కరువు అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయన్నారు. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొని కేసీఆర్ కారు గుర్తుకే ఓటేసేలా ప్రచారం చేపట్టాలన్నారు. సోషల్ మీడియాలో ముందుండాలని సూచించారు. లక్ష ఓట్లకుపైగా ఓట్లతో సీఎం కేసీఆర్‌ను, రాష్ట్రంలో 100 సీట్లతో హ్యాట్రిక్ సీఎంను చేసుకోవాలన్నారు. అంతకుముందు మహిళ అధ్యక్షురాలు కొత్త కవిత గడపగడపకూ తిరుగుతూ బొట్టు పెట్టి మహిళలంతా అభివృద్ధి ప్రదాత కేసీఆర్ వైపే ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, సర్పంచ్ రజితారమేశ్, కుమార్ ఎంపీటీసీ కావ్యాదుర్గయ్య, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మునిగడప ఎంపీటీసీ కిరణ్, సర్పంచ్‌లు యాదవరెడ్డి, రాజు, చంద్రశేఖర్, సత్యం, కనకయ్య, నర్సింలు, జగన్, స్వామి, కనకయ్య, కనకారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



కారు గుర్తుకే ఓటేస్తామని చెబుతున్న జంగంరెడ్డి పల్లె మహిళలు

# బీఆర్ఎస్‌దే మళ్లీ విజయం

**బీఆర్ఎస్ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**



ఎన్నరుపుపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిన నేతలతో రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, నవంబర్ 1: 'తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎనలేని అభివృద్ధి చేసింది. మళ్లీ విజయం మనదే. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం' అని బీఆర్ఎస్ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. 30 రోజులు తన కోసం పని చేయాలని, రాబోయే ఐదేండ్లు ప్రజా సేవకు అంకితమవుతానని తెలిపారు. ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్నరుసుపల్లి గ్రామానికి చెందిన ఇతర పార్టీల నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారికి రసమయి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని, తనను మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం రంగంపేట జీపీ పరిధిలోని మ్యాకోనిపల్లిలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. మరోసారి నువ్వే ఎమ్మెల్యే అవుతావంటూ.. ఓ వృద్ధురాలు దీవించగా రసమయి ఆప్యాయంగా అక్కున చేర్చుకొని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్‌గౌడ్, సర్పంచులు ముత్యం అమర్‌గౌడ్, బిల్లవేని పరశురాం, ఎంపీటీసీలు ఒగ్గ నర్సయ్య, గొట్టెపర్తి పరశురాం, నాయకులు కూనబోయిన బాలరాజు, రఘు, భాస్కర్, తిరుపతి పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్

గజ్వేల్, నవంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్ హెచ్చరించారు. గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో పీవో, ఏపీవోలకు రెండో రోజు ఇస్తున్న శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించారు. పోలింగ్ రోజున నిర్వహించే మాక్ పోల్ ప్రక్రియపై క్షుణ్ణంగా తెలిపి నమూనా పోలింగ్ ఎలా చేయాలో, విధులు ఎలా నిర్వర్తించాలో పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రతి ఎలక్షన్‌లో కొత్త మార్గదర్శకాలు వస్తున్నాయని, గతంలో ఎలక్షన్ విధులు నిర్వర్తించిన ప్రతి ఒక్కరూ ఇప్పుడు తెలిపే ప్రతి అంశాన్ని ముఖ్యమైనదిగా భావించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు గురించి అవగాహన ఉండాలన్నారు. శిక్షణ అధికారులను పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ హ్యాండ్ బుక్, బ్రోచర్ బుక్‌లను ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అందుబాటులో ఉంచుకోవాలని, పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో బన్సీలాల్, తహసీల్దార్ బాల్‌రాజు తదితరులు ఉన్నారు.